చిన్నారి కుటుంబానికి అండగా ఉండాలి

ప్రజాశక్తి - బద్వేలు : మూడేళ్ల చిన్నారిపై అత్యాచారం చేసి, చంపిన యువకుడిని కఠినంగా శిక్షించాలని, చిన్నారి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండాలని ఆవాజ్ కమిటీ జిల్లా అధ్యక్షులు పి.చాంద్‌బాషా, బద్వేల్ పట్టణ ఆవాజ్ కమిటీ అధ్యక్షులు ఎస్.ఎ. సత్తార్ మాట్లాడుతూ తిరుపతి జిల్లా, వడమాల పేట, అబ్బి కండ్రిక గ్రామంలో మూడేళ్ల చిన్నారి అత్యాచారం ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సుశాంత్ అనే యువకుడు చిన్నారికి చాక్లెట్ ఇప్పిస్తానని మాయ మాటలు చెప్పి ముళ్ళ పొదల్లో తీసుకెళ్లి అత్యాచారం చేసి తరుఆవత చంపేసి కాలువలో పూడ్చి ఏమీ తెలియనట్టు ఇంటికి రావడం చాలా దుర్మార్గమైన సంఘటన అని వాపోయారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇలాంటి చర్యలు పాల్పడితే ఎంతటి వారికైనా ఉరిశిక్ష విధించాలన్నారు. చిన్నారి కుటుంబానికి నష్టపరిహారంగా రూ. 30 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆవాజ్ నాయకులు ఎస్.మస్తాన్ , ఎస్.రహీం, కె.బి. రసూల్, ఎస్. షబ్బీర్, ఎస్.మహమ్మద్ అలీ, అబ్దుల్లా ,నాగూర్ పాల్గొన్నారు.

ఆశలన్నీ టమోటా పైనే.!

- జిల్లాలో వేలాది ఎకరాల్లో సాగు
- ఆశాజనకంగా పంట
- దిగుబడి, ధరల కోసం ఎదురు చూస్తున్న రైతులు

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు నియోజకవర్గంతో పాటు జిల్లాలోని పలు మండలాల్లో రబీ సీజన్‌లో రైతులు టమోటా పంటను సాగు చేశారు. జిల్లాలో అధికంగా మైదుకూరు మండల పరిధిలో 6వేల ఎకరాల వరకు పంటను రైతులు సాగు చేపట్టారు. దువ్వూరు, చాపాడు, ఖాజీపేట మండలాలలో 2 వందల ఎకరాలలో, ఇతర మండలాలలో 50 ఎకరాలలోపు సాగు చేశారు. ముందుగా సాగుచేసిన పంట దిగుబడి వారం, పది రోజుల్లో ప్రారంభంకానుంది. డిసెంబర్ మొదటి వారం నుంచి టమోటా దిగుబడి అధికంగా రానుంది. ఎకరా సాగుకు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులకు రూ. 30 వేల వరకు ఖర్చులు అవుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ. 25 -30 వరకు అమ్మకాలు చేపడుతున్నారు. ప్రస్తుతం మన ప్రాంతంలో అమ్మకాలు చేపట్టే టమోటాను మదనపల్లి, చిత్తూరు ప్రాంతాల నుండి దిగుమతి చేసుకుంటున్నారు. మైదుకూరు ప్రాంతంలో ముందస్తుగా సాగుచేసిన పంట 30 కిలోల బాక్స్ ధర రూ. 600 పలుకుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. రాబోయే నెలరోజుల పాటు వర్షాలు నమోదు అయితే పంట దెబ్బతిని దిగుబడులు తగ్గుతాయని రైతులు వాపోతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన ఉల్లి పంట అధిక వర్షాలకు దెబ్బతిని దిగుబడులు పూర్తిగా తగ్గాయి. నూర్పిడి సమయంలో ధరలు కూడా గణనీయంగా తగ్గడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. . గత నెలలో క్వింటా రూ.3 వేలు పలికిన ఉల్లి గడ్డలు ప్రస్తుతం రూ.15 వందలు పలుకుతున్నాయి. ఉల్లి సాగుచేసిన రైతులు అన్ని విధాల నష్టపోయారు. దీంతో రైతుల ఆశలన్నీ టమోటా పంటపై ఉన్నాయి. 30 కేజీల బాక్స్ ధర రూ. 300 నుంచి రూ. 600 వరకు గత ఏడాది అమ్మకాలు జరిగాయి. కేవలం ఈ ఏడాది ఒక నెలపాటు ఈ ధరలు ఉంటే ఎకరాకు రూ. 50 వేల వరకు ఆదాయం వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. ఎకరా టమోటా పంటలో వారానికి 100 బాక్సుల వరకు దిగుబడి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. ధరలు బావుంటే ఎరువులు పురుగుమందులు పిచికారి చేసి పంటను జనవరి చివరి వరకు కాపాడుకోవచ్చని చెబుతున్నారు. ప్రస్తుతం సాగుచేసిన టమోటా పంట ఆశాజనకంగా ఉందని పురుగుల బెడద కూడా కాస్త తక్కువగా ఉందని రైతులు పేర్కొంటున్నారు.

సాగులో ఉన్న టమోటా పంట

ఎకరాకు రూ.30 వేలు ఖర్చు..

టమోటా సాగుకు ఎకరాకు రూ. 30 వేల వరకు ఖర్చులు అవుతున్నాయి. ప్రస్తుతం పంట ఆశాజనకంగా ఉంది. ధరలు ఏ విధంగా ఉంటాయో అని ఆందోళనగా ఉంది. ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు అధికమయ్యాయి. దిగుబడులు చేతికి వచ్చే సమయానికి ధరలు ఉండడం లేదు. టమోటా ధరలు ఆశాజనకంగా ఉంటాయని భావిస్తున్నాం.

- వెంకటసుబ్బయ్య, టమోటా రైతు, గొల్లపల్లి.

ఆశాజనకంగా పంట ..

టమోటా పంట ప్రస్తుతం ఆశాజనకంగా ఉంది. ఈ నెల చివరి నాటికి దిగుబడులు ప్రారంభమవుతాయి. ప్రస్తుతం ధరలు 30 కిలో బాక్స్ రూ. 500 వరకు పలుకుతున్నాయి. పంట చేతికి వచ్చే సమయానికి ధరలు పెరుగుతాయని భావిస్తున్నాం. అధిక వర్షాలు పడకపోతే టమోటా ద్వారా లబ్ధి పొందే అవకాశం ఉంటుంది.

- భాస్కర్ రెడ్డి, టమోటా రైతు, లెక్కలవారిపల్లె, మైదుకూరు

నూతన సర్కిళ్లకు పోస్టులు భర్తీ చేయాలి

- పెండింగ్ డిఎలు విడుదల చేయాలి
- విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ

సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు సుదర్శన్‌రెడ్డి, సుబ్బిరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యుత్తు నూతన సర్కిల్స్‌కు నూతన పోస్ట్ మంజూరు చేయాలని విద్యుత్తు ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ చైర్మన్ సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుబ్బిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో విద్యుత్ ట్రేడ్ యూనియన్ల జిల్లా సమావేశం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ యూనియన్ జిల్లా అధ్యక్షులు నాగసుబ్బయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి, సుబ్బి రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో సర్వీసులు, లెన్త్ ఆఫ్ లైన్స్, డిటిఆర్‌లు నాలుగు రెట్లకుపైగా పెరిగాయని తెలిపారు. 20 ఏళ్లుగా కార్మిక, ఉద్యోగుల పోస్టులు మాత్రం పెంచడం లేదని చెప్పారు. ఆర్థికపరమైన సాకులతో కొత్త సర్కిళ్లకు రెగ్యులర్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ కార్మికులను పంపే ప్రయత్నం చేయడాన్ని కార్మిక, ఉద్యోగులందరూ వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు. వర్క్ నామ్స్ ప్రకారం పోస్టు మంజూరు చేసి కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్లతో భర్తీ చేయాలని చెప్పారు. రెండు రకాల సర్వీసు రెగ్యులేషన్స్ వల్ల ఇటు రెగ్యులర్ , గ్రేడ్2లు, కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్, కారుణ్య కార్మికులకు అందరికీ అన్యాయం జరుగుతుందని తెలిపారు. వన్ ఇండస్ట్రీ వన్ సర్వీస్ రెగ్యులేషన్స్ ఉండాలన్నారు. విద్యుత్ ఉద్యోగులకు రెండు డిఎలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. విద్యుత్ సంస్థల్లో వేలాది సంఖ్యలో కింద స్థాయి పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. దీని వల్ల ఉద్యోగుల మీద రోజురోజుకు పనిభారం పెరుగుతోందన్నారు. ఖాళీ పోస్టులను ప్రస్తుతం పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులతో భర్తీ చేయాలని కోరారు. రెగ్యులర్ ఉద్యోగులు చేయాల్సిన ప్రమాద పనులు సైతం కాంట్రాక్టు కార్మికులతో చేయిస్తున్నారని పేర్కొన్నారు. అన్ని విధాలా అనుభవం కలిగిన కాంట్రాక్టు కార్మికులతో ఖాళీ పోస్టులు భర్తీ చేస్తే విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించవచ్చున్నారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలను అనేకమార్లు ఎపి జెన్ కో యాజమాన్యం దృష్టికి తెచ్చామని అయినా స్పందన లేదన్నారు. కార్మికుల సమస్యల మీద విద్యుత్ మంత్రిని కలిసి విన్నవించినా ఫలితం లేదన్నారు. 2018లో చంద్ర బాబు ముఖ్యమంత్రి ఉన్న సమయంలో కాంట్రాక్టు కార్మికులకు వంద శాతం వేతనాలు పెంచడమే కాకుండా, వేతనసవరణ ఆలస్యమైన నెలలకు అరియర్స్ కూడా ఇచ్చారన్నారు. కానీ 2022లో జరగాల్సిన వేతన సవరణ 16 నెలలు ఆలస్యంగా 2023 ఆగస్టులో సవరణ చేసి అరియర్స్‌ను ఇవ్వలేదన్నారు. విద్యుత్ యాజ మాన్యాలు కాంట్రాక్టు కార్మికుల విషయములో సవతి తల్లి ప్రేమ చూపి స్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అరియర్స్ ఇవ్వకపోకడం వల్ల ఒక్కో కార్మికుడు సుమారు ఒక లక్ష రూపాయలు నష్టపోతున్నారని చెప్పారు. సిఐటి యు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ ఎపి జెన్ కో - కాంట్రాక్టు కార్మికుల్లో అనేక మంది 15 నుంచి 20 సంవత్సరాలుగా అతి తక్కువ వేత నాలతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. మంచి అనుభవం కల్గి ఐటిఐ, డిగ్రీ, డిప్లొమా విద్యార్హతలు ఉన్నప్పటికీ వారికి అన్‌స్కిల్డ్ వేతనాలు ఇవ్వడం దారు ణమని వాపోయారు. ఒకే రాష్ట్రంలో కొన్ని విద్యుత్ సంస్థల్లో ఒక మాదిరిగా, ఎపి జెన్‌లో ఒకలా గ్రేడ్ ఇవ్వడం అన్యామన్నారు. యునైటెడ్ ఎంప్లాయిస్ యూని యన్ల డిస్కం అధ్యక్షులు శివ శంకర్ మాట్లాడుతూ 2018లో జరిగిన వేతన సవరణలో పది సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకున్న ప్రతి కార్మికుడికి సర్వీస్ ఇన్సెంటివ్ కింద నెలకు రూ. ఐదు వందల నుంచి రూ.వేయి ఇచ్చే వారని చెప్పారు. జెన్‌కో నాయకులు నరసింహులు మాట్లాడుతూ జెన్‌కో 25 ఏళ్లుగా ఒకే కేడర్‌లో ఉన్న జెపిఎంలను పిఎలుగా ఉద్యోగోన్నతులు కల్పిం చాల న్నారు. త్వరలోనే ఈ సమస్యలన్నిటిపై కలిసి వచ్చే కార్మిక, ఉద్యోగ సంఘా లతో, కార్మిక ఉద్యోగులతో కలిపి ఒక విస్తృత సమావేశం ఏర్పాటు చేసి నిర్ణ యాలు తీసుకుంటామన్నారు. సమావేశంలో స్ట్రగుల్ కమిటీ నాయకులు ఎస్. జి.శేఖర్, సురేంద్ర, నాగ మల్లయ్య, బాష, శివ ప్రసాద్ రెడ్డి, నాగరాజుయ పాల్గొన్నారు.

స్థల ప్రదాత సంపత్‌కుమార్

వైవీయూ ఇన్‌ఛార్జి విసి కె.కృష్ణారెడ్డి

సంపత్‌కుమార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విసి

ప్రజాశక్తి - కడప అర్బన్

'తెలుగు సూర్యుడు' సి.పి.బ్రౌన్ నివసించిన బంగళా స్థలాన్ని బ్రౌన్ స్మారక గ్రంథాలయ ఏర్పాటుకు విరాళమిచ్చి సిపి బ్రౌన్‌కు వెలుగునిచ్చిన స్థలదాత సి.కె.సంపత్ కుమార్ అని యోగివేమన విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జ్ విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో సి.పి.బ్రౌన్ స్మారక గ్రంథాలయ స్థలదాత 'సి.కె.సంపత్ కుమార్' 84వ జయంతి స్మారకోపన్యాసం ఆదివారం నిర్వహించారు. తొలుత అతిథులంతా కలసి స్థలదాత ఆయన చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ సంపత్ కుమార్ గ్రంథాలయ నిర్మాణానికి 20 సెంట్ల స్థలమివ్వడమే కాక, సి.పి.బ్రౌన్ మెమోరియల్ ట్రస్టుకు అధ్యక్షులుగా సేవలందించి, సంస్థ అభివృద్ధిలో క్రియాశీలక పాత్ర పోషించారన్నారు. అందుకు కృతజ్ఞతగా సి.కె.సంపత్ కుమార్ జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించేలా చర్యలు చేపట్టి, ప్రతి ఏటా క్రమం తప్పకుండా ఆ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. సభాధ్యక్షులు, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ 1976లో ఆచార్య జి.ఎన్.రెడ్డి, బంగోరె, ఆరుద్ర, ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డి కలసి బ్రౌన్ నివసించిన బంగళా శిథిలాలను గుర్తించి, ఆ స్థానంలో బ్రౌన్ స్మారక గ్రంథాలయ నిర్మాణం చేపట్టాలని అప్పటి కలెక్టర్ డాక్టర్ పి.ఎల్.సంజీవరెడ్డిని కోరారన్నారు. ఆ సమయంలో స్థలదాత సి.ఆర్.కృష్ణస్వామి ప్రస్తావన వారి మధ్య వచ్చినట్లు, ఆయన్ను స్థలం ఇవ్వమని కోరగా అంగీకరించారని, ఆయన మరణానంతరం తండ్రికి తగ్గ తనయుడుగా ఆయన మాటను నిలబెడుతూ సంపత్ కుమార్ స్థలాన్ని బహూకరించడం గొప్పవిషయమన్నారు కార్యక్రమంలో . యోగివేమన విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, ఆచార్య మాడభూషి, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి పాల్గన్నారు.

మొక్కలు నాటడం అభినందనీయం : సిఐ

ప్రజాశక్తి - బద్వేలు

డివైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నాయకత్వం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని అర్బన్ సిఐ రాజగోపాల్ పేర్కొన్నారు. ఆదివారం డివైఎఫ్ఐ ఆవిర్భవించి 44 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పట్టణంలోని సుందరయ్య కాలనీలో 44 మొక్కలు నాటారు. కార్యక్రమానికి సిఐతోపాటు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయ్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం కాలుష్యం పెరిగి వాతావరణంలో అనేక మార్పులు సంభవిస్తున్నాయి అన్నారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటితే పర్యావరణాన్ని కాపాడుతుంది అన్నారు. డివైఎఫ్ఐ అంటే యువత కోసం పోరాటాలు నిర్వహించడమేగాక ఇటువంటి సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. నేటి యువత డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు, మాదక ద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. యువత నేటి సమాజానికి మంచి చేసే విధంగా ఉండాలని చెప్పారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని మాట్లాడుతూ డివైఎఫ్ఐ యువజన సంఘం పోరాటాలు, ఆందోళనలు నిర్వహించడమే కాదు అని సామాజిక,సేవా కార్యక్రమాలు వంటివి కూడా నిర్వహిస్తూ యువతను చైతన్యవంతులను చేస్తుందని చెప్పారు. కడప ఉక్కు కోసం పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.కె.మస్తాన్ షరీఫ్, ఎస్.కె ఆదిల్ బద్వేల్ రూరల్ కార్యదర్శి యు.బాల గురయ్యా మహిళా కో - కన్వీనర్ ఎస్.కె.ఫాతిమా, నాగేశ్వరి, పట్టణ నాయకులు యువరాజ్ ఖలీల్ నాగేంద్ర సురేష్ మాఫిర్ ప్రసాద్ మరియు డివైఎఫ్ఐ సుందరయ్య కాలనీ వాసులు పాల్గొన్నారు.

మొక్క నాటుతున్న సిఐ, యుటిఎఫ్, డివైఎఫ్ఐ నాయకులు

కడప కలెక్టర్‌గా చెరుకూరి శ్రీధర్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప కలెక్టర్‌గా డాక్టర్ చెరుకూరి శ్రీధర్ నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్రప్రభుత్వం ఆదివారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన 2009 ఐఎఎస్ బ్యాచ్ అధికారి. ప్రస్తుతం రాష్ట్ర ఇండస్ట్రీస్ డైరెక్టర్‌గా విధుల నిర్వహిస్తున్నారు. కేంద్రప్రభుత్వం డిఒపిటి నిబంధనల ప్రకారం కడప కలెక్టర్ సహా మరో ఐదుగురు ఐఎఎస్ అధికారులు తెలంగాణాలో విధులు నిర్వహించాలని ఆదేశించింది. ఇందులోభాగంగా కడప కలెక్టర్ లోతేటి శివశంకర్ తెలంగాణా రాష్ట్రానికి బదిలీపై వెళ్లాల్సి వచ్చింది. కేంద్ర ప్రభుత్వ నిబంధనలను సవాలు చేస్తూ సదరు ఐఎఎస్ అధికారులు క్యాట్, హైకోర్టు, క్యాట్ ట్రిబ్యునల్ వంటి అత్యున్నత న్యాయస్థానాలను ఆశ్రయించారు. సివిల్స్ పరీక్షల దరఖాస్తు నమోదు సమయంలో హైదరాబాద్ స్థానికతను పొరపాటున నమోదు చేసుకున్నామని, వాస్తవానికి ఆంధ్రప్రదేశ్ వాసులమని, తమ సర్వీసును ఆంధ్ర ప్రదేశ్‌లోనే కొనసాగించేలా చూడాలనే వాదనతో అత్యున్నత న్యాయ స్థానాలను ఆశ్రయించారు. ఈనెల ఐదున ట్రిబ్యునల్ తీర్పు వెలువడే ముందర రాష్ట్రప్రభుత్వం కొత్త కలెక్టర్‌ను నియమిస్తూ ఆదేశాలు జారీ చేయడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

నేడు డయల్ యువర్ కలెక్టర్

ప్రజాశక్తి - కడప : ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితి సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించి 08562-244437 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవలసిందిగా తెలిపారు.

చెన్నకేశవ కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి -గోపవరం

మండలంలోని పెద్ద గోపవరం గ్రామానికి చెందిన కోడూరు చెన్నకేశవ (26) అన్నమయ్య జిల్లా సంబేపల్లె వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. వృత్తి రీత్యా మృతుడు బార్బర్‌షాపులో పనిచేస్తూ జీనం సాగిస్తున్నాడని, అతనికి భార్య, కుమార్తె ఉందన్నారు. చెన్నకేశవ మృతితో కుటుంబం వీధిన పడిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

క్రీడా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయ రెండవ దశ అంతర్ కళాశాలల క్రీడా పోటీలను ఆదివారం వైవీయూ విసి ఆచార్య కె. కృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ పోటీలలో భాగంగా వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, షూటింగ్, బెస్ట్ ఫిజిక్ పోటీలను విద్యాలయ వ్యాయామ విద్య , క్రీడల శాస్త్రాల విభాగంలో పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు పది కళాశాలల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు.

మెరుగైన ఫలితాల సాధనకు కృషి

- ప్రభుత్వ కళాశాలల్లో పెరిగిన విద్యార్థులు
- టాప్-5లో నిలవడమే లక్ష్యంగా అడుగులు
-ఇంటర్మీడియట్ ఆర్ఐఒ బండి వెంకటసుబ్బయ్య

ఇంటర్‌లో మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేస్తున్నాం. గతేడాది రాష్ట్రంలోని 26 జిల్లాల జాబితాలో కింది నుంచి ఐదు స్థానాలకు ఎగబాకి మెరుగైన ఫలితాల సాధనలో ఒక అడుగు ముందుకు వేయడమైంది. ఈ ఏడాది 26 జిల్లాల జాబితాలోని మొదటి ఐదు స్థానాల్లో నిలవడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. రాష్ట్ర విద్యాశాఖా మంత్రి ఇంటర్ కళాశాలల ప్రారంభ దశలోనే టెక్స్, నోట్ పుస్తకాలు, బ్యాగులను సైతం అందజేయడంతో పరీక్షల సన్నద్ధతకు ఎంతో ఉపకరించిందని చెప్పవచ్చు. దీనికితోడు నాలుగు యూనిట్ పరీక్షలు, క్వార్టర్లీ, హాప్ ఇయ ర్లీ, రెండు ప్రీఫైనల్ పరీక్షలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించడంపై దృష్టి సారించాం. అనంతరం కామన్ ఎగ్జామినేషన్ ప్రిపరేషన్‌పై పూర్తి స్థాయిలో దృష్టి సారించే దిశగా కసరత్తు చేస్తున్నామని పేర్కొంటున్న ఇంటర్మీడియట్ ఆర్ఐఓ బండి వెంకటసుబ్బయ్యతో ముఖా ముఖి...

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ముఖా ముఖి..

కళాశాలల వివరాలు తెలపండి?

జిల్లాలో 152 కళాశాలలున్నాయి. 20 ప్రభుత్వ, ఎనిమిది ఒకేషనల్, 11 ఎపిఎస్‌డబ్ల్యుఆర్ఎస్, ఐదు ఎయిడెడ్, మూడు మోడల్, 17 కెజిబివి, 14 హైస్కూల్ ప్లస్, 74 ప్రయివేటు కళాశాలలున్నాయి.

విద్యార్థుల వివరాలు చెప్పండి?

జిల్లాలో 33,952 మంది విద్యార్థులున్నారు. ఇందులో ఫస్టియర్‌లో బాలికలు 13,609 మంది, సెకెండ్ ఇయర్‌లో 8,760 మంది వెరసి 18,369 మంది, బాలుర ఫస్టియర్‌లో 8,166 మంది, సెకెండ్ ఇయర్‌లో 15,583 మంది ఉన్నారు.

విద్యార్థుల సంఖ్య పెరుగుదలకు కారణమేమిటి?

జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలో సుమారు 1500 మంది విద్యార్థులు పెరగడం సంతోషదాయకం. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడం, వారి అభ్యసనా పద్ధతికి తోడ్పాటు అందించడంగా భావిస్తున్నాం.

ఫలితాల మెరుగుదలకు తీసుకుంటున్న చర్యలేమిటి?

ఇంటర్ ఫలితాల మెరుగుదలకు ప్రత్యేక కసరత్తు చేయడమైంది. ఇంటర్మీడియట్ కళాశాలల కమిషనర్ ఆదేశాల మేరకు ఏడాదిలో నాలుగు యూనిట్ పరీక్షలు, క్వార్టర్లీ, హాఫ్‌ఇయర్లీ, రెండు ప్రీఫైనల్ వంటి ప్రణాళికను అమలు చేస్తున్నాం. సంస్థాగత పరీక్షల ఫలితాల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. పరీక్షలు పూర్తి చేసిన వెంటనే మార్కులను ప్రకటించి, తల్లి దండ్రులను సమావేశపరిచి ప్రోగ్రెస్‌కార్డులను అందజేస్తాం.

ఫలితాల్లో వెనుకబాటుతనానికి కారణాలేమిటి?

టెన్త్‌కూ, ఇంటర్ పరీక్షా విధానానికి వ్యత్యాసం ఉంటోంది. ఇంటర్ పరీక్షల్లో డిస్క్రిప్టివ్ విధానం ఉంటుంది. ఇంటర్ ఫలితాల్లో వెనుకబాటుతనానికి ప్రధాన కారణం క్రీమ్ (తెలివైన విద్యార్థులు) తిరుపతి, విజయవాడ, గుంటూరు హైదరాబాద్ పట్టణాల్లోని పలు కార్పొరేట్ కళాశాలలకు పెద్దఎత్తున వెళ్లిపోవడమేనని చెప్పుకోవాలి. మిగిలిన పేదరికం, ఆర్థిక స్తోమత లేని విద్యార్థుల తల్లిదండ్రులకు, విద్యార్థులకు చదువుల పట్ల అవేర్‌నెస్ లేకపోవడం మరొక కారణంగా చెప్పుకోవాలి. ప్రభుత్వ ఇంటర్ కళాశాలలో అర్హత కలిగిన అనుభవం కలిగిన ఫ్యాకల్టీ ఉన్నప్పటికీ ఫలితాల్లో అట్టడుగున నిలుస్తున్నాం.

పరీక్ష ఫీజుల వివరాలు తెలపండి?

సకాలంలో పరీక్ష ఫీజులు చెల్లించాలి. ఈ ఏడాది అక్టోబర్ 11 నుంచి నవంబర్ 11 వరకు గడువులోపు చెల్లించాలని కోరాం..ఆర్ట్స్ గ్రూపులకు చెందిన ఫస్టియర్ విద్యార్థులు రూ. 1300, సైన్స్ విద్యార్థులు రూ.2,200 మాత్రమే చెల్లించాలి. ఇంటర్ ఫిస్టయర్ ఆర్ట్స్ గ్రూపు విద్యార్థులు రూ.600, సెకెండియర్ విద్యార్థులు రూ.600 చొప్పున చెల్లించాలి. సైన్స్ ఫస్టియర్ విద్యార్థులు రూ.600 అదనంగా ప్రాక్టికల్స్ రూ.275 వెరసి రూ.875 చెల్లించాలి. ఈనెల 11 దాటిన అనంతరం రూ.1000 జరిమానాతో ఫీజు చెల్లించాల్సి ఉంటుందని గమనించాలి.

పరీక్షల సన్నద్ధత ఎలా ఉంది?

జిల్లాలోని 152 కళాశాలలకు చెందిన వెనుకబడిన విద్యార్థులు, ఉత్తమ ప్రతిభావంతులపై ప్రత్యేక దృష్టి సారించాం. కళాశాలల ప్రారంభానికి ముందే ఉదయం ఎనిమిది గంటల నుంచి తొమ్మిది గంటలపాటు ప్రిపరేషన్, సాయంత్రం నాలుగు గంటల నుంచి ఐదు గంటల వరకు ప్రిపరేషన్ ప్రత్యేక తరగతులు తీసుకుంటున్నాం. ఫిబ్రవరి, మార్చి మాసాల్లోని కామన్ ఎగ్జామినేషన్‌కు పకడ్బందీగా ప్రిపరేషన్ చేయడంపై దృష్టి సారించాం. ఫలితంగా మెరుగైన ఫలితాలు సాధనకు అవకాశం ఉందనే ఆశావహ దృక్పథంతో ముందుకెళ్తున్నాం.

వైస్ ప్రిన్సిపల్‌ను సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

వ్యాధి తీవ్రతపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-కడప సిటీ

ఆధునిక ప్రపంచంలో వ్యాధుల తీవ్రతపై ఎప్పటికప్పుడూ అవగాహన పెంచుకోవాలని డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ తరపున జోనల్ సిఎంఇ, కో-ఆర్డినేటర్, కడప ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్, బయో కెమిస్ట్రీ హెచ్ఒడి డాక్టర్ లక్ష్మీ నరసమ్మ తెలియజేశారు. ఆదివారం కడప ప్రభుత్వ వైద్య కళాశాల ఆవరణంలో ఫిజియాలజీ లెక్చర్ గ్యాలరీలో డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ సురేఖ ఆదేశాల మేరకు జోనల్-3 సీఎం ఈ (కంటిన్యూస్ మెడికల్ ఎడ్యుకేషన్) కార్యక్రమాన్ని మైక్రో బయాలజీ హెచ్ఒడి డాక్టర్ బి. నాగశ్రీలత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కో- ఆర్డినేటర్‌గా వ్యవహరించిన డాక్టర్ లక్ష్మీనరసమ్మ మాట్లాడుతూ ప్రస్తుతం నిర్వహిస్తున్న కార్యక్రమంలో ఆధునిక ప్రపంచంలో వస్తున్న వ్యాధుల తీవ్రతపై విజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు వైద్య విద్యార్థులు, పీజీ విద్యార్థులు, వైద్యులు పెంపొందించుకొని, ఆయా వ్యాధుల బాధపడే రోగులకు వైద్య సేవలను అందించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మైక్రో బయాలజీ డాక్టర్ బి .నాగ శ్రీలత మాట్లాడుతూ కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి ఒక్కరు వ్యాధుల తీవ్రత, వాటి వల్ల కలిగే దుష్ప్రభావాల పట్ల, ఎదుర్కొనే విధానాల పట్ల, నయం చేసేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల అప్రమత్తంగా ఉండాలని వివరించారు. కార్యక్రమంలో కడప ప్రభుత్వ వైద్య కళాశాల మైక్రోబయాలజీ అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ నాగ సుధారాణి, డాక్టర్ గీతాంజలి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీకాంత్, మహమ్మద్ షాహిద్, డాక్టర్ ఖాజా మొహిద్దీన్, డాక్టర్ సౌమ్య, సివిల్ అసిస్టెంట్ సర్జన్స్ డాక్టర్ శ్రీ లక్ష్మి, డాక్టర్ నజ్మా, డాక్టర్ విజయవర్ధన్ రెడ్డి, డాక్టర్ సుదర్శన్ రెడ్డి, డాక్టర్ కౌసల్, వివిధ వైద్య కళాశాల నుంచి పీజీ వైద్య విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

బస్టాండ్ ఆవరణలో ముళ్లపొదలు తొలగింపు

ప్రజాశక్తి -గోపవరం : స్థానిక బస్ స్టాండ్ ఆవరణంలోని ముళ్ల పొదలను బద్వేలు రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో తొలగించారు. బద్వేలు - నెల్లూరు రహదారి పై ఉన్న బస్ స్టాండ్‌ను 15 ఏళ్ల కిందట నిర్మించారు. వినియోగంలో లేకపోవడంతో చుట్టూ ముళ్ల పొదలు పెరిగాయి. దీంతో అసాంఘిక కార్యక్రమాలకు, బహిరంగ మద్యపానానికి అడ్డాగా మారింది. ఎస్పి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు బద్వేలు రూరల్ సిఐ నాగభూషణం ఆధ్వర్యంలో గోపవరం ఎస్.ఐ శ్రీకాంత్, సిబ్బందితో కలసి జెసిబితో ముళ్ల పొదలు తొలగించడంతో బస్ స్టాండ్ ప్రాంగణం సుందరంగా తయారయింది. స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ సామాజిక సేవా కార్యక్రమాల్లో పోలీసుల చొరవ, కృషిని అభినందించారు.

విద్యార్థులకు వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న సిద్దయ్య

దోమకాటుకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

దోమ కాటుకు దూరంగా ఉండాలని, జాగ్రత్తలు తీసుకోవాలని మలేరియా సబ్ యూనిట్ వైద్యాధికారి సిద్దయ్య సూచించారు. పట్టణ పరిధిలోని బాలికల హాస్టల్‌ను ఆదివారం ఆయన సందర్శించారు. బాలికలకు మలేరియా, డెంగీ, చికెన్‌గన్యా, బోదకాలు, మెదడువాపు వ్యాధి వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ఆయా వ్యాధులకు సంబంధించిన లక్షణాలు కనిపిస్తే దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలని సిద్దయ్య సూచించారు.

సభ్యత్వ నమోదులో టిడిపి నాయకులు

మాసాపేటలో టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి- కడప అర్బన్

నగరంలోని మాసాపేటలో టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మసాపేట శివ ఆధ్వర్యంలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం సభ్యత్వ నమోదులో ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా విశేష స్పందన లభిస్తుందని పేర్కొన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవి ఆదేశాల మేరకు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. సభ్యత్వం ఉన్నవారికి రూ.5లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. ఆరోగ్య, విద్యా, వైద్య పరంగా లబ్ధి చేకూరి, పార్టీ రక్షణగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో 26వ డివిజన్ టిడిపి ఇన్‌ఛార్జి చవలముడి శంకర్, కడప పార్లమెంట్ తెలుగుమహిళ ఉపాధ్యక్షురాలు మౌనిక, యన్.ఆర్.ఐ నాయకులు షేక్. రహమతుల్లా, 28 డివిజన్ ఇన్‌ఛార్జి రాఘవ, ఎస్సి సెల్ మాజీ నగర అధ్యక్షుడు చవలముడి జనార్దన్, టి.ఎన్.ఎస్.ఎఫ్.నగర అధ్యక్షులు అనిల్, యువత బక్కా చిన్న,ఆనంద్, శివ, శ్రీకాంత్, ఇర్ఫాన్, మహిళలు పద్మిని, జయశ్రీ పాల్గొన్నారు.

శాంతితోనే సుఖమయ జీవితం

ప్రజాశక్తి - కడప అర్బన్

శాంతితోనే సుఖమయ జీవితం లభిస్తుందని మరియాపురం పీఠాధిపతి గాలి బాలి పేర్కొన్నారు. ఆదివారం మరియాపురంలోని సెయింట్ మేరీస్ కథడ్రిల్ చర్చిలో పీఠాధిపతిగా 40 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా విశేష ప్రార్థనలో సందేశం ఇచ్చారు. శాంతియుత వాతావరణం విలసిల్లాలని ఆకాంక్షించారు. తాగు బిషప్‌గా 32 సంవత్సరాలు గుంటూరు పీఠంలో ఉంటూ సేవలు అందించామన్నారు. అనంతరం ఆరేళ్లుగా కడపకు వచ్చి పనిచేస్తున్నామన్నారు. సుదీర్ఘకాలంగా ఎన్నో రకాల సేవలు అందించామని, పేదలు, అనాథల పట్ల సహాయ సహకారాలు అందిస్తూ వస్తున్నామన్నారు. పలువురు గురువులతో పాటు, విశ్వాసులు ఆయన ఆశీస్సులు పొంది శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చర్చిల నిర్వాహకులు, క్రైస్తవ మత పెద్దలు, పెద్ద ఎత్తున విశ్వాసులు పాల్గొన్నారు.

బిషప్‌ను సన్మానించిన విజయ్ సుశీల్ కుమార్

కడప : మరియాపురం పీఠాధిపతి గాలి బాలి 40 సంవత్సరాల జూబిలీ వేడుకలు స్థానిక కడప నగరంలోని మరియపురం చర్చిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆ వేడుకలకు యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నంది మండలం విజయ సుశీల్ కుమార్ హాజరై బిషప్ గాలి బాలిరెడ్డిని శాలువా పూల దండతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలోజిల్లా కతోలిక కోశాధికారి ఫాదర్ సంబంటూరు సురేష్, ,మరియ పురం చర్చి గురువు మరియన్న, అర్యోగ మాత చర్చి గురువు ప్రసాద్, గ్రామ పెద్దలు ఎన్ విజయరాజు, బాలయ్య, జార్జ్, భాస్కర్, కిషోర్ పాల్గొన్నారు.

బిషప్‌ను సన్మానిస్తున్న విజయ్ సుశీల్‌కుమార్

ఎస్ఇ శివకుమార్ దంపతులను సన్మానిస్తున్న సిబ్బంది

శివకుమార్ సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆర్అండ్ బి క్వాలిటీ కంట్రోల్ కడప సర్కిల్ ఎస్ఇ ఎం.శివకుమార్ సేవలు ప్రశంసనీయమని పలువురు కొనియాడారు. ఆయన ఉద్యోగ విరమణ సందర్భంగా ఆదివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి వివిధ జిల్లాలకు చెందిన ఎస్ఇలు, ఇఇలు, డిఇలు, ఎఇలు హాజరయ్యారు. శివ కుమార్ దంపతులను ఘనంగా సన్మానిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను విద్యార్థి దశలో ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో చదివి కష్ట పడి ఉన్నత స్థాయికి చేరుకున్నానని చెప్పారు. తన ఉన్నతికి తల్లి దండ్రులు, తన అన్న సహాయ సహకారాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆర్ అండ్ బి నేషనల్ హైవే లో పనిచేశానని తెలిపారు. చదువు పూర్తయిన వెంటనే ఉద్యోగం వచ్చిందని చెప్పారు. ఉద్యోగంలో ఉన్నప్పుడు విధులు బాగా నిర్వహించామనే సంతృప్తి ఉందని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు, కాంట్రాక్టర్లు, సిబ్బంది, కుటుంబ సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

జగన్ వ్యక్తిగత విలాసాల కోసమే 'రుషికొండ'

ప్రజాశక్తి - కడప అర్బన్ : గత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వ్యక్తిగత విలాసాల కోసం వందల కోట్లు ప్రజల సొమ్మును ఖర్చు చేసి రుషికొండ ప్యాలెస్‌ను నిర్మించాలని టిడిపి నాయకులు కొండ సుబ్బయ్య పేర్కొన్నారు. ఆదివారం మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజా ప్రతినిధులు, మీడియా ప్రతినిధులతో కలిసి పరిశీలించారని తెలిపారు. ప్రజలకు వాస్తవాలు తెలియజేస్తామని చెప్పడం హర్షనియమని పేర్కొన్నారు. ప్రజా అవసరాలకు రుషికొండ ప్యాలెస్ ఉపయోగపడేలా చూడాలని కోరారు.

సచివాలయ ఇంజినీర్ల నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లాలో సచివాలయంలో విధిని నిర్వహిస్తున్న ఇంజినీర్స్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో కార్యవర్గ ఎంపికను రాష్ట్ర నాయకులు శ్రీకర రావు, మాధవరెడ్డి నిర్వహించారు. జిల్లా అధ్యక్షులుగా వెంకట మురళీధర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్‌గా కుమార్ బాబు, ఖలీల్ బాషా, కె.వి. సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వి.దామోదర్, ఉమెన్ సెక్రటరీగా డి.గాయత్రి, మౌనిక ఎంపికైనట్లు తెలిపారు.

రహదారులే అడ్డా.. ఆవుల సంచారం

ఇబ్బందులు పడుతున్న వాహనదారులు- తరచూ ప్రమాదాలు.. భయభ్రాంతుల్లో జనం-పట్టని అధికారులు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల పట్టణంలో ఆవులు ప్రధాన రహదారులపై సంచరిస్తూ వాహనదారులకు తీవ్ర ఇబ్బందికరంగా మారాయి. రోడ్లపై వీటిని చూసి ప్రజలు కూడా భయాందోళనకు గురవుతున్నారు. ప్రధాన రహదారుల్లో ఆవులు సంచారం ఎక్కువగా ఉన్నా అధికారులు ఏమాత్రం పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కొందరు పశువుల యజమానులు ఇలా రోడ్డుపై వదిలేయడంతో అవి రోడ్లపైనే సేద తీరుతున్నాయి. పార్నపల్లె రోడ్డు, మారుతి థియేటర్ రోడ్డు ప్రాంతాల్లో పదుల సంఖ్యలో పశువులు రోడ్లపై సంచరించడమే కాకుండా అక్కడే పండుకుంటున్నాయి. పశువులు రోడ్డుపై ఉం డడంతో పలుమార్లు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల పకతి రెస్టారెంట్ సమీపంలో నడుచుకుంటూ పోతున్న ఓ మహిళపై ఆవు దాడి చేసి గాయపరిచిన సంఘటన చోటుచేసుకుంది. కొద్ది రోజుల క్రితం బైక్‌పై వెళుతున్న బార్యభర్తకు ఆవు అడ్డు రావడంతో బ్రేక్ వేయగా కిందపడి గాయాల పాలయ్యారు. పార్కింగ్ చేసిన బైకు బ్యాగులలో ఉన్న వస్తువులను కూడా లాగి నాశనం చేస్తున్నాయి. పార్నపల్లి బస్టాండ్, పూలంగళ్ల సర్కిల్, బిఎస్ఎన్ఎల్ కార్యాలయం తదితర ప్రాంతాల్లో పశువులు సంచరిస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడమే కాకుండా మార్కెట్‌కు వచ్చే వారిపై కొమ్ములతో దాడి చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. సంబంధిత అధికారులు రోడ్లపై సంచరిస్తున్న పశువుల యజమానులను గుర్తించి మళ్లీ వాటిని వదలకుండా చర్యలు తీసు కోవాలని ప్రజలు కోరుతున్నారు. మున్సిపల్ అధికారులు, పోలీసులు పశువుల యజమానులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని దుకాణాదారులతోపాటు ప్రజలు కోరుతున్నారు.

ఆవుల సంచారంతో ప్రమాదాలు

రాత్రి, పగులు తేడా లేకుండా ఆవులు రోడ్లపైనే తిరుగుతున్నాయి. ప్రమాదాలు జరగడమే కాకుండా, వాటి వల్ల ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. కొన్ని సార్లు వాహనాలు అదుపుతప్పి కింద పడుతున్నాం. తగిన చర్యలు తీసుకోవాలి.

- సంపత్‌కుమార్, పులివెందుల

దుకాణం ముందే తిష్ట వేస్తున్నాయి

రాత్రి వేళ ఆవులు మార్కెట్‌లో మా దుకాణాల ముందు పడుకుంటున్నాయి. ఎంత తోలినా మళ్లీ మళ్లీ ఇక్కడికే వస్తూ వ్యాపారాలకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. కూరగాయల బుట్టలు కింద పడేసి తింటున్నాయి. వారసంత రోజు జనం ఎక్కువగా ఉండడంతో జనం మధ్యలో నుండి పశువులు వెళుతుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వాటిని రోడ్లపైకి రాకుండా అధికారులు యజమానులపై చర్యలు తీసుకోవాలి.

- కుల్లాయమ్మ, కూరగాయల వ్యాపారి, పులివెందుల

రోడ్లపై వెళ్లాలంటే భయమేస్తుంది

ఆవులు ఎక్కడబడితే అక్కడ ఉండడం వల్ల అవి దాడి చేస్తాయని రోడ్లపై వెళ్లాలంటే భయంగా ఉంది. గతంలో దాడి చేసిన ఘటనలు చాలా ఉన్నాయని భయంతో రోడ్లపై వెళ్లాల్సి వస్తుంది. **- లక్ష్మీదేవి, మహిళ, పులివెందుల**

తోపుడు బల్ల వ్యాపారం కష్టంగా ఉంది

తోపుడుబండ్ల పైన పండ్లు, కూరగాయలు వ్యాపారాలు చేయాలంటే ఆవుల దాడి వల్ల చాలా కష్టంగా ఉంది. బండ్ల పైన ఉన్న పండ్లు, కూరగాయలను నాశనం చేస్తున్నాయి. తీవ్రంగా నష్టపోతున్నాం.

- ధనరాజ్, పండ్ల వ్యాపారి, పులివెందుల

ఐఎఎస్ సాధనకు మార్కులతో సంబంధమే లేదు

- ఐఎఎస్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మయ్య

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఐఎఎస్ సాధనకు టెన్త్, ఇంటర్, డిగ్రీ మార్కులతో సంబంధమే లేదని ఐఎఎస్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మయ్య తెలిపారు. స్థానిక కొర్రపాడు రోడ్డులోని కామిశెట్టి సుబ్బారావు, చెన్నమ్మ డిగ్రీ కళాశాలలో ఆదివారం సంస్కృతి స్వచ్ఛంద సంస్థ, డాక్టర్ లక్ష్మయ్య ఐఎఎస్ అకాడమీ సంయుక్తంగా సివిల్స్‌పై ఆసక్తి కలిగిన మహిళలకు ఉచిత శిక్షణ అందించడం కోసం అర్హత పరీక్ష నిర్వహించారు. దాదాపు వంద మంది మహిళలు ఈ పరీక్ష రాశారు. కరస్పాండెంట్ నంద్యాల కొండారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభకు ముఖ్యఅతిథిగా డాక్టర్ లక్ష్మయ్య మాట్లాడుతూ ఐఎఎస్ సాధనకు వార్తలు వినడం, దినపత్రికలు చదవడం, సామాజిక అవగాహన అవసరమన్నారు. సాధారణ ప్రజ్ఞ కలిగిన విద్యార్థులు కూడా రోజుకు 10 నుంచి 12 గంటలు కష్టపడితే లక్ష్యం సాధించగలరన్నారు. సభాధ్యక్షులు కరస్పాండెంట్ నంద్యాల కొండారెడ్డి మాట్లాడుతూ పోటీ పరీక్షలకు తెలివితేటలతోపాటు సరైన దిశానిర్దేశం సూచించే గురువులను ఎన్నుకోవడం కూడా ప్రధానమన్నారు. డాక్టర్ లక్ష్మయ్య మార్గదర్శకత్వంపై తనకు నమ్మకముందన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన పులివెందుల ఆర్‌డిఒ భానుశ్రీ మాట్లాడుతూ సాధించాలనే తపన, కఠోరశ్రమ, సమయపాలన పాటిస్తే లక్ష్యం సాధించడం చాలా సులువైనపనని, తల్లిదండ్రుల ప్రోత్సాహం, సరైన కోచింగ్ సెంటర్‌నే ప్లాట్‌ఫామ్ గమ్యానికి చేరుస్తాయన్నారు. సంస్కృతి స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ సివిల్స్ బ్రహ్మ డాక్టర్ లక్ష్మయ్య పేద విద్యార్థులు వారి కలలను సాకారం చేసుకునేందుకు వారధిగా నిలవడం గర్వించదగ్గ విషయమన్నారు. డాక్టర్ వరుణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఢిల్లీలో దాదాపు రూ.10లక్షలు ఖర్చయ్యే కోచింగ్‌ను సమర్థత కలిగి స్తోమత లేని విద్యార్థులకు డాక్టర్ లక్ష్మయ్య ఉచితంగా అందించడం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు విశ్రాంత వ్యాయామ అధ్యాపకులు కోటా ఓబులరెడ్డి, గండికోట షేక్షావల్లి, కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్‌రెడ్డి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పులివెందుల ఆర్‌డిఒ భానుశ్రీని సన్మానిస్తున్న నిర్వాహకులు

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి - ఖాజీపేట

అక్రమంగా మద్యం విక్రయించినా, బెల్ట్‌షాపులు నిర్వహించినా కఠినచర్యలు తప్పవని సిఐ ఆర్.మోహన్ హెచ్చరించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్‌షాప్‌లు నిర్వహించవద్దన్నారు. మద్యం దుకాణాదారులు బెల్ట్‌షాప్‌ల వారికి సహకరిస్తున్నట్లు తెలిస్తే ఉపేక్షించేది లేదని సిఐ హెచ్చరించారు. బెల్ట్‌షాపులకు సంబంధించి గ్రామాల్లో ఎవరికైనా సమాచారం తెలిస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అలాంటి వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

5న కొండయ్య స్వామి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - మైదుకూరు(చాపాడు)

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని ధరణి తిమ్మాయిపల్లి గ్రామం పూసయ్యగారి ఆశ్రమంలో నీళ్ల స్వామిగా పిలిచే అవధూత కొండయ్య స్వామి 43వ జన్మదిన వేడుకలను ఈనెల 5 ఘనంగా నిర్వహించనున్నట్లు ఆయన భక్తులు తెలిపారు. వేడుకల్లో భాగంగా మంగళవారం నుంచి 9వ తేదీ శనివారం వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 5 నుంచి నిత్య అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. 6న బుధవారం నుంచి 9న శనివారం వరకు వివిధ ఎడ్లచే బండలాగుడు పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 6న రూ.3లక్షల జాక్‌పాట్ పోటీలు నిర్వహిస్తున్నారు.

నేడు అన్న క్యాంటీన్ ప్రారంభం

ప్రజాశక్తి - మైదుకూరు(చాపాడు)

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను సోమవారం ప్రారంభిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు హాజరవుతారని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని పేద ప్రజలకు అన్న క్యాంటీన్ అందుబాటులోకి రానుందని ఆయన పేర్కొన్నారు.

గుంతల రోడ్లకు మోక్షం

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రంలో రోడ్లను గుంతల రహితంగా మార్చాలని లక్ష్యంతో 'మిషన్ పాత్‌హోల్ ఫ్రీ ఎపి' పేరిట రోడ్లు మరమ్మతు చేపట్టడం సంతోషకరమని కడప నగరంలోని విద్యార్థులు, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం నగరంలోని వై.జంక్షన్, పాత బైపాస్ మెయిన్ రోడ్డు పై ఉన్న గుంతలకు వేసిన ప్యాచ్ వర్క్ నిల్చొని హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు, కడప ఎమ్మెల్యే మాధవికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ నాయకులు బిల్లా నవీన్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఫరీద్, వర్ధన్, భూపేష్, రామ్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల జీతాలు ఆలస్యం ఎందుకు? : ఎస్‌టియు

మాట్లాడుతున్న ఎస్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ఉపాధ్యాయుల జీత భత్యాల చెల్లింపులు అన్ని విభాగాల ఉద్యోగులతో సమానంగా ఒకే సమయంలో జరగాలని ఎస్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక ఎస్‌టియు కార్యాలయంలో ఆదివారం సంఘ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల జీతాల చెల్లింపు విధానంలో ముందుగా ప్రభుత్వంలోని అన్ని విభాగాలకు జీతాలు చెల్లించిన తర్వాతనే ఉపాధ్యాయుల జీతాలు చెల్లించే విధానం సరైందికాదన్నారు. గత ప్రభుత్వం కూడా ఇలాగే చేసి, ఎన్నికల్లో పరాజయం చెందిందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు రెండవ శ్రేణి ఉద్యోగులు కాదని కూటమి ప్రభుత్వం గుర్తు పెట్టుకోవాలని చెప్పారు. అందరితోపాటు సమానంగా ఉపాధ్యాయుల జీతాలను కూడా చెల్లించేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల ప్రభుత్వ బీమా సంస్థ ఎపిజిఎల్ఐ, ప్రావిడెంట్ ఫండ్‌లో పొదుపు చేసుకున్న సొమ్మును అత్యవసరాలకు ఇవ్వాలని కోరారు. ఉద్యోగ విరమణ, రుణం పెట్టుకున్న సందర్భంలోనూ చెల్లించాల్సిన పేమెంట్ విషయంలో కూడా ప్రావిడెంట్ ఫండ్ మార్చి 2024 వరకు చెల్లించలేదని తెలిపారు. ప్రభుత్వ బీమా సంస్థ క్లెయిమ్స్ చెల్లింపులు 18 నెలలుగా ఆగిపోయినట్లు తెలిపారు. ఈ ప్రభుత్వమైనా ఉద్యోగుల సంక్షేమాన్ని మరవకుండా ఉద్యోగులకు చెల్లించాల్సిన పాత బకాయిలన్నీ వెంటనే చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న 12వ పిఆర్‌సికి సంబంధించిన మధ్యంతర భృతిని ముఖ్యమంత్రి స్వయంగా సంఘాలతో చర్చించి ప్రకటించాల్సిన గత్యంతర పరిస్థితి నెలకొందన్నారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో ఎస్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంభం బాలగంగిరెడ్డి, కడప జిల్లా ప్రధాన కార్యదర్శి నర్రెడ్డి సంగమేశ్వర్‌రెడ్డి, అనంతపురం జిల్లా అధ్యక్షులు రమణారెడ్డి, రాష్ట్ర కమిటీ కన్వీనర్ శివారెడ్డి, రీజియన్ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, నాయకులు రమణారెడ్డి, శివశంకర్ రెడ్డి, పిసి బాలయ్య పాల్గొన్నారు.

క్రైం కార్నర్

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

మృతి చెందిన బాబుల్ రెడ్డి

పులివెందుల బ్రాహ్మణపల్లి రోడ్డు శేషారెడ్డి స్కూల్ సమీపంలో రేకుల షెడ్డులో నివాసముంటున్న బాబుల్‌రెడ్డి (35) జీవితం మీద విరక్తితో ఆదివారం ఉదయం ట్యాంక్ పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, బంధువుల కథనం మేరకు వివరాలు.. అనంతపురం జిల్లా ఎల్లనూరు మండలం వెన్నపూస పల్లి గ్రామానికి చెందిన బాబుల్‌రెడ్డికి తల్లిదండ్రులు చనిపోవడంతో మేనత్త లక్ష్మమ్మ దగ్గరే ఉంటున్నాడు. కొన్నేళ్ల కిందట తల్లిదండ్రులు చనిపోవడంతో బాబుల్‌రెడ్డికి మతిస్థిమితం సరిగాలేదు. మానసికంగా ఇబ్బంది పడుతుండేవాడు. ఈ పరిస్థితుల్లో పులివెందులలోని రంగనాథ స్వామి గుడి సమీపంలో ఉన్న వాటర్ ట్యాంక్ ఎక్కి కిందికి దూకి ఆత్మ చేసుకున్నాడు. విష యం తెలు సుకున్న ఎస్ఐ విష్ణు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పులి వెందుల సర్వ జన ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీసుల అదుపులో ఇసుక వాహనాలు

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక పాపాఘ్ని నదిలో ఇసుకను తరలించేందుకు మట్టి రోడ్డు వేస్తున్న వావానాలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శనివారం రాత్రి వేంపల్లెలోని పాపాఘ్ని నదిలో రోడ్డు వేసేందుకు గ్రావెల్ తీసుకొని వాహనాలు వెళ్లాయి. పాపాఘ్ని నది నుండి ఇసుకను తరలిస్తున్నారని పోలీసులకు సమాచారం రావడంతో ఆర్కేవ్యాలీ ఎస్ఐ భాస్కర్‌రెడ్డి పాపాఘ్ని నదిలోకి వెళ్లారు. నదిలో మట్టి వేసి రోడ్డును చదును చేస్తున్న రెండు టిప్పర్లు, ఒక ఇటాచీ, ఒక జెసిబిని అదుపులోకి తీసుకొని వేంపల్లె పోలీసుస్టేషన్‌కు తరలించారు.

పది మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి - వల్లూరు

మండలంలోని పైడి కాలువ క్రాస్ రోడ్డు వద్ద చిన్న రెడ్డయ్య అనే వ్యక్తి వద్ద నుంచి పది మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు కమలాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ షేక్ రోషన్ తెలిపారు. ఆదివారం పైడికాలువ క్రాస్ వద్ద అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు దాడి చేశారన్నారు. కేసు నమోదు చేశామన్నారు. ఈ సందర్భంగా సిఐ రోషన్ మాట్లాడుతూ ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోలీసుల అదుపులో నిందితుడు, మద్యం బాటిళ్లు

తల్లికి వందనం నిల్.. తండ్రికి ఇంధనం ఫుల్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కూటమి పాలనలో తల్లికి వందన నిల్.. తండ్రికి ఇంధనం ఫుల్ అని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి, ప్రొద్దుటూరు అసెంబ్లీ కాంగ్రెస్ సమన్వయకర్త షేక్ పూల నజీర్ పేర్కొన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తల్లికి వందనం పథకం కింద పాఠశాలకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15,000 ఇస్తామని మ్యానిఫెస్టోలో చెప్పారని, విద్యా సంవత్సరం సగం పూర్తయినప్పటికీ ఇంత వరకు అతీగతీ లేదన్నారు. ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా 3 సిలిండర్లు సరఫరా చేస్తామని చేయడం లేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగభృతి వెంటనే అమలు చేయాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతుకు ఏటా రూ.20వేలు ఇస్తామని హామీ ఇచ్చి ఖరీఫ్ సీజన్ ముగిసినప్పటికీ 0.20పైసలు కూడా ఇవ్వలేదన్నారు. ఈ పథకం కాస్త అన్నదాత దుఃఖీభవ పథకంగా తయారైందన్నారు. గోరుచుట్టపై రోకటిపోటులా కరెంటు సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజలపై రూ.6073కోట్ల అదనపు భారం మోపడం శోచనీయమన్నారు. ఏరు దాటినంత వరకు ఓడ మల్లన్న దాటినాక బోడి మల్లన్న అనే ధోరణి మాని ఎన్నికల సందర్భంగా ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను వెంటనే అమలు చేయాలని వారు కోరారు. కరెంటు సర్దుబాటు ఛార్జీలు ఉపసంహరించాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న తులసిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు

మురికి కూపంగా వారపు సంత..

అల్లాడిపోతున్న వ్యాపారులు, కొనుగోలుదారులు - ప్రారంభానికి నోచని కొత్త మార్కెట్

మురుగు పక్కనే కొనసాగుతున్న వారపు సంత

ప్రజాశక్తి - చక్రాయపేట

మండల కేంద్రమైన చక్రాయపేటలో ప్రతి ఆదివారం వారపు కొనసాగుతుంది. వారపు సంత మురుగు కాలువలో ఉన్నట్లుంటుంది. వ్యాపారస్తులు మార్కెట్లో కూరగాయల అంగళ్లు పెట్టుకోవాలంటే వీల్లేక లబోదిబోమంటున్నారు. కొనుగోలుదారులు రావాలంటే హడలిపోతున్నారు. మురుగు నీరు పైన దోమలు విజృంభిస్తుంటాయి. అవి కూరగాయలపై వాలుతుండడంతో వినియోగదారులు అల్లాడిపోతున్నారు. కూరగాయలు కొనాలంటే జంకుతున్నారు. ప్రతి ఆదివారం చుట్టుపక్కల గ్రామాలైన తిమ్మారెడ్డిగారి పల్లె, యార్లవార్లపల్లె, నాగిరెడ్డిపల్లి, ఇసుక చింతలపల్లె, ఉప్పలవాండ్ల పల్లె, వీరనారాయణ పల్లి, గండికోవూరు దళితవాడ, బుసిరెడ్డిపల్లి, గండి కొవ్వూరు, మారెళ్లమడక, చిలేకంపల్లి, ఆంజనేయపురం, ఆవులవాండ్ల పల్లె గ్రామాల నుంచి కొనుగోలుదారులు కూరగాయల మార్కెట్‌కు వస్తారు. ఇక్కడ పరిస్థితిని బట్టి మార్కెట్లో కూడా అంగళ్ల వ్యాపారస్తులు లబోదిబోమంటున్నారు. ఏడాదికి లక్షలాది రూపాయలు మార్కెట్‌కు ఆదాయం వస్తున్నా మార్కెట్లో వ్యాపారస్తులకు వినియోగదారులకు సరైన ఏర్పాటు చేయడం లేదు. గతంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కొత్త మార్కెట్ ఏర్పాటు చేశారు. కానీ అది ప్రారంభానికి నోచుకోకపోవడంతో గతంలో ఉన్నచోట కొనసాగుతోంది. మురుగునీరు రాకుండా అరికట్టడంలో అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నూతనంగా నిర్మించిన మార్కెట్‌ను ప్రారంభించడం లేదా కొనసాగుతున్న వారపు సంతలో డ్రయినేజీ కాలువ ఏర్పాటు చేయాలని వ్యాపారులు, కొనుగోలుదారులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి

ఎస్ఐ మోహన్ కుమార్ గౌడ్

ప్రజాశక్తి - పుల్లంపేట

వాహనదారులు అప్రమత్తంగా ఉంటేనే రోడ్డు ప్రమాదాలు నివారించ వచ్చని ఎస్ఐ మోహన్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం కడప- చెన్నై హైవే రోడ్డుపై ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ప్రతి వాహనదారుడు ప్రమాదాలు నివారించు కోవాలంటే హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, రోడ్డు భద్రతా నియమాలు పాటించకుండా పోవడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగు తున్నాయని అన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.